# నాణానికి అటూ ఇటూ



ఆ పర్సులో డబ్బు తీసి ఖర్చు పెడుతోంటే, మనసు మూలల్లోంచి బాధ కలగటం సూర్యారావుకు తెలుస్తూనే ఉంది. అయినా అది పట్టించుకోకుండా చేతిలోని వంద రూపాయల నోటు కౌంటర్లోని వ్యక్తికి అందించాడు. అతను బిల్లుడబ్బు తీసుకొని మిగతా డబ్బును రెండుసార్లు లెక్కవేసి సూర్యారావుకు అందించాడు.

ఆ తర్వాత ఆ చిల్లరనోట్లు ఎలా ఖర్చయిపోయాయో సూర్యారావుకు తెలీలేదు. ఏ ఖర్చు చూసినా అత్యవసరమైందిగానే, ఏదీ వాయిదా వేయలేని ఖర్చుగానే కనపడటంతో తప్పనిసరి అయిపోయింది అతనికి. ఖర్చు పెట్టనంతసేపూ నోట్లు ఘనపదార్థంగా ఉన్నవి ఖర్చు పెట్టటం ఆరంభించగానే ఆవిరిలాగా ఏ గాలిలో కలిసి పోయాయో తెలీలేదు.

తిరిగి తిరిగి ఇంటికొచ్చాడు. ఇంటికొచ్చేసరికి ఇంట్లో అతను కట్టాల్సిన చిట్ డబ్బులు కట్టటం మరిచిపోయాడనీ, ఇలా మర్చిపోతే తమకు కోర్టుకు వెళ్లటం మినహా ఇంకో మార్గం లేదని ఆ కంపెనీ వాళ్ళు పంపించిన నోటీసు అతనికోసం వేచి చూస్తోంది.

సూర్యారావుకు నీరసమొచ్చింది. కష్టాలన్నీ కూడబలుక్కొనే వస్తాయా?

లేకపోతే, ఇది తన జీవితంలో వచ్చిన పెద్దపరీక్షా? అతనికేం అర్థం కావటం లేదు.

ఆ కంపెనీవాళ్ళ నోటీసు ఒకసారికి రెండుసార్లు చదివాడు. రెండోసారి చదువుతోంటే అతనికి భయం వేసింది. కోర్టుకు అంటే వద్దు, ఆ గతి తనకు పట్టటం దౌర్భాగ్యమే అవుతుంది అనుకున్నాడు సూర్యారావు. అది తప్పించుకోవాలంటే....?

ఎక్కడుంది మార్గం?

జీతం రావాలంటే ఇంకా ఇరవై రోజులు కావాలి. కానీ వాళ్ళు ఇరవై రోజులు ఆగరు. ఆగదల్చుకోనట్లు స్పష్టంగా నోటీసు పంపారు.

అంటే... తను ఆ డబ్బు వెంటనే కట్టాల్సి ఉంటుంది! సూర్యారావుకు నీరసం వచ్చింది.

భర్త ఉత్తరం చదువుకుంటోంటే, టీ కాయటానికి వెళ్ళింది సూర్యారావు భార్య మీనాక్షి. ఆమె వంట ఇంట్లోనే ఉందన్న సంగతి ఇంకోసారి ధృడపర్చుకొని, జేబులోంచి పర్సు తీసాడు సూర్యారావు.

పర్సులో ఇంకో అయిదువందల అరవై రూపాయలున్నాయి. తను చిట్‌ఫండ్ కంపెనీలో కట్టాల్సింది నూటనలభై రూపాయలే!... కానీ ఇది అన్యాయం అని మనసు మరోసారి అరవటం అతనికి తెలుస్తూనే ఉంది.

మీనాక్షి ఇచ్చిన టీ తాగి, జోళ్ళు వేసుకొని, బయటకు నడుస్తూ అన్నాడు సూర్యారావు "ఇప్పుడే ఓ అరగంటలో వస్తా!"

అన్నట్లుగానే ఓ అరగంటలో తిరిగి వచ్చాడు కూడాను! పర్సులో నాలుగు వందల ఇరవై రూపాయలే ఉన్నాయి అన్నది అతనికి తెలుసు. కానీ ఇంటికి రాగానే పర్సుతీసి మళ్ళీ అంతా లెక్కలేసి పెట్టాడు నాలుగువందల ఇరవై రూపాయలు, ఇంకొంచెం చిల్లరా ఉంది. వాటితో బాటుగా ఏవో లెక్కలు, ఇంకో విజిటింగ్ కార్డు ఉన్నాయి పర్సులో.

విజిటింగ్ కార్డు తీసిచూసాడు ఆ కార్డుమీద కె.నాగరాజ్ అనే పేరు, అతని అడ్రసూ ఉన్నాయి.

❖ ❖ ❖

"నా పేరే నాగరాజ్" అన్నాడతను సూర్యారావును చూస్తూ.

సూర్యారావు ఒక్క క్షణం అలాగే నిలబడి ఆ తర్వాత అన్నాడు "నా పేరు సూర్యారావు."

"కూర్చోండి."

సూర్యారావు కూర్చున్న తర్వాత మరొక్కసారి ఆలోచించాడు. తను చేస్తున్నది మంచిపనా, కాదా అనేది. తను తెలివితక్కువపని చేస్తున్నాడనే అనుమానం కూడా కలిగింది అతనికి...

అయినా నెమ్మదిగా అన్నాడు... "మీ పర్సునాకు దొరికింది...."

నాగరాజు సూర్యారావుకేసి చూశాడు 'మొన్న... సీతాఫల్‌మండి బస్సులో... ఇదుగో ఆ...' అని జేబులోంచి పర్సుతీసి నాగరాజు ముందు పెట్టాడు సూర్యారావు.

నాగరాజు పర్సు అందుకొన్నాడు. పర్సుతీస్తోంటే అన్నాడు సూర్యారావే మళ్ళీ

“క్షమించండి, పర్సు దొరికినప్పుడు అందులో ఆరువందలు ఉండేవి. అత్యవసరం అయిపోయి నేనోరెండు వందలు ఖర్చు పెట్టుకోవాల్సి వచ్చింది”.

నాగరాజు కనుబొమ్మలు ముడిపడ్డాయి.

‘మీరు అపార్థం చేసుకోకండి. పర్సు దొరికాక, తెచ్చి ఇచ్చేయాలనే అనుకొన్నాను. కానీ నాకొచ్చిన అవసరాలు అలాటివి, తప్పలేకపోయింది. ఇప్పుడందులో నాలుగొందలే ఉన్నాయి.’

నాగరాజుకూ అందులో నాలుగొందలే కనబడ్డాయి.

తనకేసి తీవ్రంగా చూస్తున్న నాగరాజు చూపులను తప్పించుకొంటూ తలవంచుకొని అన్నాడు సూర్యారావు. ‘పర్సు పోగొట్టుకున్నది మీరు. నాకు దొరికింది. నాకుకాక ఇంకెవరికి దొరికినా మీకు తిరిగి వచ్చేదికాదు. కానీ, నా పద్ధతి వేరు. ఈ డబ్బులు ఖర్చుపెట్టేసుకొంటే అది నా బతుక్కే మచ్చ అవుతుందన్నది నాకు తెలుసు. అందుకే పర్సులో ఉన్న మీ విజిటింగ్ కార్డును బట్టి, మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చాను. ఇకపోతే, నేను ఖర్చు పెట్టిన రెండు వందల సంగతి చెప్పాగదా, నా పరిస్థితి అలా వచ్చింది. నా కొక్క నెల రోజులు టైం ఇస్తే, మీ డబ్బు మీకు నేనే తెచ్చిస్తాను. సూర్యారావు చెప్పటం ఆపి, నాగరాజ్‌కేసి చూశాడు.

నాగరాజ్ చూపుల్లోంచి వస్తున్న ఆ ప్రశ్నలను ఎదుర్కొంటూ అన్నాడు ‘మీకు నా మీద నమ్మకం కుదిరినట్లుగా లేదు.’

నాగరాజ్ క్షణం ఆగి అన్నాడు “నమ్మకం కుదరక కాదు..”

‘మీకు కావాలంటే నా అడ్రసు రాసిస్తా... ఖచ్చితంగా ఒకేనెల! నెలలోగానే ఇచ్చేస్తా...’

నాగరాజ్ ఏమనుకొన్నాడో క్షణం తర్వాత, డ్రాయరు తెరిచి అందులోంచి ఓ కాగితం అందించాడు సూర్యారావుకు. సూర్యారావు ఆ కాగితం మీద తన ఇంటి అడ్రసు, ఆఫీసు అడ్రసూ వివరంగా రాసి నాగరాజ్‌కు అందించాడు. నాగరాజ్ ఆ కాగితాన్ని ఒకసారి చదువుకొని, మడత పెట్టుకొని జేబులో పెట్టుకొన్నాడు.

‘వస్తానండీ మళ్ళీ కనిపిస్తాను’ అని చెప్పి సూర్యారావు బయటకు నడిచాడు.

సూర్యారావు పూర్తిగా కనుమరుగయ్యేంతవరకూ ఆగి, ఆ తర్వాత మళ్ళీ ఆ పర్సు అందుకొన్నాడు నాగరాజ్.

ఆ పర్సులోకి తనపేరు, అడ్రసు ఉన్న ఆ విజిటింగ్ కార్డు ఎలా వచ్చిందా అని క్షణం ఆలోచించాడు నాగరాజ్. అపుడతనికి గుర్తొచ్చింది - వారంరోజుల కిందట తను వెళ్ళినపుడు తన స్నేహితుడు ఆఫీసులో లేకపోతే, పక్క సీటతనికి తన విజిటింగ్ కార్డు ఇచ్చి వచ్చిన సంగతి.

అంటే ఈ పర్సు ఆ మహానుభావుడిదన్నమాట, అనుకొన్నాడు నాగరాజ్.

సాయంత్రం అయిదింటికి ఆఫీసు అయిపోయాక, ఇంటికి వెళ్ళేటపుడు, నాగరాజ్ ఆ పర్సులోని నాలుగువందలు జేబులో పెట్టుకొని, ఆ ఖాళీ పర్సును మునిసిపాల్టీ చెత్తకుండిలో పారవేసేటపుడు, అతని ఆలోచనలన్నీ వచ్చేనెల సూర్యారావు తెచ్చి ‘ఇవ్వాల్సిన’ ఆ రెండువందల రూపాయలమీదే ఉన్నాయి.

*- యువ, ఏప్రిల్,1977*